### దరఖాస్తుల ఆహ్వానం

భైంసా, డిసెంబర్ 3: భైంసాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో ఐదు నుంచి ఎనిమిదో తరగతి వరకు ఇంగ్లిష్ బోధించుటకు, ఆరు నుంచి పదో తరగతి వరకు హిందీ సబ్జెక్టు బోధించుటకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ సుమలత ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల మహిళా అభ్యర్థుల సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల భైంసా నందు బుధవారం ఉదయం 9 గంటలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

బజార్‌హత్నూర్, డిసెంబర్ 3: బజార్‌హత్నూర్‌లోని కేజీబీవీలో ఫిజిక్స్, బయోలజీ, తెలుగు ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆ పాఠశాల ఇన్‌చార్జి ఎస్‌వో లక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన బీఈడీ మహిళ అభ్యర్థులు కేజీబీవీలో బుధవారం సాయంత్రం వరకు దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

### కుటుంబ సర్వే పత్రాల అప్పగింత

ఖానాపూర్ టౌన్, డిసెంబర్ 3: మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేపత్రాలను ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేసి తహసీల్ కార్యాలయంలో మంగళవారం అందజేశారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో 10,605 కుటుంబాలకు సంబంధించిన సమాచారం సకాలంలో ఆన్‌లైన్ చేసి తహసీల్దార్ శివరాజ్‌కు అందజేసినట్లు ఎంపీవో రత్నాకర్‌రావు తెలిపారు. సర్వేలో సేకరించిన వివరాలను వేగవంతంగా ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేసినందుకు సిబ్బందిని తహసీల్దార్ అభినందించారు.

### వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 3: వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాంనగర్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ శ్రీమంత్ అన్నారు. మంగళవారం నిర్మల్‌లోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో రాంనగర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. దాదాపు 150 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు కమలారాణి, నాగమణి, ఆశ కార్యకర్తలు వర్ణమాల, సులోచన పాల్గొన్నారు.

### ట్రస్మా క్రీడల్లో రబీంద్ర విద్యార్థుల ప్రతిభ

ముథోల్, డిసెంబర్ 3 : ముథోల్‌లోని రబీంద్ర పాఠశాలకు చెందిన విద్యార్థులు నిర్మల్ జిల్లా ట్రస్మా ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ సాయినాథ్ తెలిపారు. అథ్లెటిక్స్ జూనియర్ బాలుర విభాగంలో 100 మీటర్ల పరుగు పందెంలో దత్తహరి జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి, బాలికల విభాగంలో శరణ్య జిల్లా స్థాయిలో తృతీయ బహుమతి, జూనియర్ కబడ్డీ విభాగంలో జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచి కప్‌ను కైవసం చేసుకున్నట్లు వివరించారు. వీరికి పాఠశాల తరఫున అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రాజేందర్, పీఈటీలు పాల్గొన్నారు.

### మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నార్నూర్, డిసెంబర్ 3 : తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వ పాఠశాలలోని మధ్యాహ్న భోజన కార్మికులు మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈవో పవార్ అనితకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన రాష్ట్రీయ సభ్యుడు జాడే నాందేవ్, తాయిబాయి, మన్నలబాయి, స్రవంతి, సునీత, జైతుబాయి, దేవ్‌రావ్, దేవీదాస్ పాల్గొన్నారు.

# దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా
- ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

ఉట్నూర్: విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసిన ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా

ఉట్నూర్, డిసెంబర్ 3 : దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా అన్నారు. మంగళవారం ఉట్నూర్‌లోని దివ్యాంగుల పాఠశాలలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేసి దివ్యాంగులకు శుభాకాంక్షలు తెలిపారు. దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా సహాయసహకారాలు ఉంటాయన్నారు. దివ్యాంగులు బాధపడకుండా లక్ష్యంతో ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మార్మాట్, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దిలావర్‌పూర్, డిసెంబర్ 3: దిలావర్‌పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గత సంవత్సరం ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన దివ్యాంగుడైన కదంబ అనూష్‌ను మండల విద్యాధికారి శంకర్ సన్మానించారు. అనంతరం దివ్యాంగులకు పలు పరికరాలు అందజేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సదానంద్, ఉపాధ్యాయులు లావణ్య, హన్మాండ్లు, పీడీ అంబాజీ, విద్యార్థులు పాల్గొన్నారు.

దస్తురాబాద్, డిసెంబర్ 3 : మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఐఈఆర్‌సీ ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులకు ఆటలపోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు కాంప్లెక్స్ ఇన్‌చార్జి హెచ్‌ఎం జొన్నల రవీందర్ అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు కోట వేణు, రవీందర్, పీఆర్‌టీయూ మండలాధ్యక్షుడు వెంకట నర్సింహరావు, సీఆర్పీ తిరుపతి, ఐఈఆర్పీలు జగన్, ఉదయ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### దివ్యాంగులు అందరితో సమానం

ఇంద్రవెల్లి, డిసెంబర్ 3: సమాజంలో దివ్యాంగులను అందరితో సమానం చూడాలని తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం బుద్ధనగర్ ఎంపీపీఎస్–2 పాఠశాలలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి మనుకుమార్, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు రాంమోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉట్నూర్ రూరల్, డిసెంబర్ 3 : గంగన్నపేట్ గ్రామంలోని భవిత విలీన విద్యా వనరుల కేంద్రంలో ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాథోడ్ కైలాస్, ప్రత్యేక ఉపాధ్యాయులు బండారి శ్రీనివాస్, సౌజన్య, ఐఈఆర్పీ రమేశ్, ఆత్రం అర్జున్, అంగన్‌వాడీ టీచర్ రత్నమాల, పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముథోల్, డిసెంబర్ 3: ముథోల్‌లోని భవిత విలీన విద్యావనరుల కేంద్రంలో సమగ్ర శిక్షా ద్వారా దివ్యాంగ పిల్లలకు అందిస్తున్న కార్యక్రమాలతో పాటు తదితర ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి మండల విద్యాధికారి రమణా రెడ్డి బహుమతులు అందజేశారు. ముథోల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు ఖుసుర్, స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ సాయికృష్ణ, ఎస్జీటీ రాజ్ కుమార్, ఐఈఆర్పీ విజయ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనం పరిశీలన

భోజనాన్ని పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఇచ్చోడ(సిరికొండ), డిసెంబర్ 3: సిరికొండలోని జడ్పీఎస్‌ఎస్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు పెంటన్న, చిన్న రాజన్న పరిశీలించారు. నాణ్యమైన భోజనం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అనుక్షణం మధ్యాహ్న భోజనంలో పర్యవేక్షణలో ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంఈవో సునీల్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజనంలో నాణ్యమైన భోజనం అందించడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు సునీల్, మల్లేశ్, నర్సయ్య, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగారాం, ప్రాథమిక పాఠశాల మాజీ కోఆప్షన్ సభ్యుడు గుగ్గిల్ల స్వామి పాల్గొన్నారు.

## ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తి అరెస్ట్

నిందితుడిని చూపిస్తున్న ఎస్ఐ శ్రీకాంత్

నేరడిగొండ, డిసెంబర్ 3 : ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి డబ్బులు తీసుకొని మోసం చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు నేరడిగొండ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కుమారి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి 2021లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపూర్ జిల్లా రేచనపల్లిలోని రత్నడిఫెన్స్ అకాడమీలో కోచింగ్ తీసుకునేవాడు. చిత్తూరు జిల్లా చౌడపల్లి గ్రామానికి చెందిన కళ్యాణ్‌తో కుమారి గ్రామానికి చెందిన వ్యక్తికి పరిచయం అయ్యాడు. ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని, బెంగళూరులో అధికారులతో పరిచయాలు ఉన్నాయ అని కళ్యాణ్ చెప్పాడు. దీంతో బాధితుడు నమ్మించి కళ్యాణ్‌తో రూ.13 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. కళ్యాణ్‌కు నగదు, ఫోన్‌పే రూపంలో రూ.5,88,586 చెల్లించాడు. సంవత్సరం తర్వాత తప్పుడు కాల్ లేటర్ ఇచ్చి మోసం చేసిండని గమనించి బాధితుడు 2022లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అయితే ఎస్పీ గౌష్ ఆలం ఆదేశాల మేరకు ఉట్నూర్ డీఎస్పీ నాగేంద్ర పర్యవేక్షణలో ఇచ్చోడ సీఐ భీమేశ్ ఆధ్వర్యంలో నేరడిగొండ ఎస్ఐ శ్రీకాంత్, సిబ్బందితో టీంగా ఏర్పాటై మంగళవారం ఆదిలాబాద్ సమీపంలో నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్నారు. అతని వద్ద నుంచి రూ.2,01,000 స్వాధీనం చేసుకొని రిమాండ్ పంపినట్లు ఎస్సై తెలిపారు.

## ఆరు గ్యారెంటీల అమలుపై చిత్తశుద్ధి కరువు


కుభీర్: చార్జిషీట్ ప్రతులను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

కుభీర్, డిసెంబర్ 3: ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలంటూ విస్తృత ప్రచారం చేసి ఓట్లు దండుకుని దొడ్డిదారిన గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలను పచ్చి మోసం చేసిందని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. మండలంలోని దార్‌కుభీర్ గ్రామంలో ఆరు గ్యారెంటీలు, 66 మోసాలుపై బీజేపీ రూపొందించిన చార్జిషీట్ ప్రతుల ప్రదర్శన అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏడాది గడుస్తున్న హామీలు అమలు కాలేదని అన్నారు. మహిళలకు ఒక ఉచిత బస్సు ప్రయాణం కూడా భయాందోళనను కలిగిస్తోందని అన్నారు. కాంగ్రెస్ మోసాలను గ్రామ గ్రామానికి, గడపగడపకు చేరవేసేందుకు గాను డిసెంబర్ 1 నుంచి 5 వరకు ప్రజల్లో చైతన్యాన్ని కల్పిస్తామన్నారు. అనంతరం దార్‌కుభీర్ గ్రామానికి వెళ్లే మార్గంలో పీఆర్ శాఖ నుంచి మంజూరైన రూ.54లక్షలతో చేపట్టనున్న వంతెన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజేశ్‌బాబు, విఠల్, దత్తాత్రి, బందెల శంకర్, గంగాధర్, మారుతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

### మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం

భైంసా, డిసెంబర్ 3 : భైంసాలోని ప్రభుత్వ ఏరియా దవాఖానలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో శ్రీ దుర్గా మహిళా శక్తి క్యాంటీన్‌ను ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, మున్సిపల్ వైస్ చైర్మన్ జాబీర్ అహ్మద్, కౌన్సిలర్ తోట విజయ్, నాయకులు గంగాధర్, రజాక్, వెంగల్ రావు, ఏరియా దవాఖాన సూపరింటెండెంట్ డా. కాశీనాథ్ పాల్గొన్నారు.

## శ్రీకాంతాచారి వర్ధంతి

కుంటాల: శ్రీకాంతాచారి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు

భైంసా: నివాళులర్పిస్తున్న డాక్టర్ కిరణ్ కొమ్రేవార్

కుంటాల, డిసెంబర్ 3 : కుంటాలలోని శాంతినికేతన్ విద్యానిలయంలో శ్రీకాంతాచారి వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంతోష్, డైరెక్టర్ ప్రవీణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోథ్, డిసెంబర్ 3: బోథ్‌లో విశ్వకర్మ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ ఉద్యమకారుడు శ్రీకాంతాచారి వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బోథ్ పట్టణాధ్యక్షుడు రంగు రాజు, ఉపాధ్యక్షుడు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మెడిచెల్మ ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, పట్టణ ఉపాధ్యక్షులు సౌరాల రూపేశ్, సంతోష్, నరేందర్, సుధాకర్, ఈశ్వర్ పాల్గొన్నారు.

ఎదులాపురం, డిసెంబర్ 3 : ఆదిలాబాద్‌లోని బస్టాండ్ ఎదుట విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శ్రీకాంతాచారి చిత్రపటం, విగ్రహానికి ఎమ్మెల్యే పాయల్ శంకర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అదే విధంగా విశ్వబ్రాహ్మణ సంఘం, కాంగ్రెస్ నాయకులు శ్రీకాంతా చారి విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిక్కాల దత్తు, కలల శ్రీనివాస్, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు కిష్టయ్య, హన్మాండ్లు, సతీశ్, సంతోష్, శ్రీలేఖ పాల్గొన్నారు.

భైంసా, డిసెంబర్ 3: హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్‌లో తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శ్రీకాంతాచారి వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ముథోల్ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కిరణ్ కొమ్రేవార్ పాల్గొని నివాళులర్పించారు.

ఖానాపూర్, డిసెంబర్ 3: ఖానాపూర్‌లోని జగన్నాథ్ చౌరస్తాలో స్వర్ణకార సంఘం నాయకులు శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గంగనర్సయ్య, అజయ్, రవితేజ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కడెం,డిసెంబర్ 3 : కడెంలో స్వర్ణకార సంఘం నాయకులు శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్వర్ణకార సంఘం మండలాధ్యక్షుడు ఎనుగురి సదానందం, నాయకులు శంకర్, వినయ్, వెంకట చారి, సతీశ్, ప్రహ్లాద్, రఘు పాల్గొన్నారు.

## సీఎం కప్ పోటీల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 3 : సీఎం కప్ పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సీఎం కప్ పోటీల నిర్వహణ, ధాన్యం కొనుగోళ్లు, సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే, ప్రభుత్వ వసతి గృహాల పర్యవేక్షణ అంశాలపై సంబంధిత శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో పోటీలు నిర్వహించి వాటిలో విజయం సాధించిన వారికి మండల, జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించాలన్నారు. గ్రామాల్లో ఆట మైదానాలు గుర్తించి పోటీలకు సిద్ధం చేయాలన్నారు. ఈ నెల 7,8 తేదీల్లో గ్రామీణ స్థాయి, 10 నుంచి 12 వరకు మండల స్థాయి, 16 నుంచి 21 వరకు జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించాలన్నారు. సమగ్ర కుటుంబ సర్వే 97.22 శాతం పూర్తయిందన్నారు. వసతి గృహాల్లో ప్రత్యేకాధికారులు తనిఖీ చేస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, సీపీవో జీవరత్నం, డీఆర్డీవో విజయలక్ష్మి, డీఈవో రామారావు, డీపీవో శ్రీనివాస్, జడ్పీ సీఈవో గోవింద్, జిల్లా పరిశ్రమల మేనేజర్ నర్సింహారెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్ఐకి సన్మానం

ఇచ్చోడ(సిరికొండ), డిసెంబర్ 3: సిరికొండ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన శివరామ్‌ను మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్సై రమేశ్, మాజీ సర్పంచ్ పెంటన్న ఎండీ ఎక్బల్, మాజీ ఎంపీటీసీ లతీఫ్, మాజీ ఉప సర్పంచ్ చిన్న రాజన్న, మాజీ సర్పంచ్ సూర్యకాంత్, విజయ్, నాయకులు లస్మన్న, ప్రభాకర్, సునీల్, నర్సయ్య, ఎల్పుల మల్లేశ్, రాజు, ప్రభాకర్ పటేల్, నర్సింహులు, రాజు, నారాయణ పాల్గొన్నారు.

ఎస్ఐని సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

### ఇసుక వాహనాలు సీజ్

బేల, డిసెంబర్ 3: మండలం నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఒక టిప్పర్, రెండు ట్రాక్టర్లను మంగళవారం ఎస్సై దివ్యభారతి పట్టుకొని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల కేంద్రంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా అక్రమంగా తరలిస్తున్న ఇసుక టిప్పర్‌తో పాటు రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు తెలిపారు. సీజ్ చేసిన వాహనాలను మైనింగ్ అధికారులకు అప్పగించడం జరుగుతుందని తెలిపారు. ఆమె వెంట సిబ్బంది ఏఎస్ఐ సలీం, సంతోష్, సిబ్బంది ఉన్నారు.

### వంటగదులను శుభ్రంగా ఉంచుకోవాలి

ఇచ్చోడ(సిరికొండ), డిసెంబర్ 3: మధ్యాహ్న భోజన కార్మికులు వంట గదులను శుభ్రంగా ఉంచుకోవాలని సిరికొండ ఎంఈవో సునీల్ సూచించారు. మంగళవారం సిరికొండ ఉన్నత పాఠశాలలో మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ వంట పాత్రాలు, గదులు, వంట వండే తీరును వివరించారు. అలాగే ఇచ్చోడ మండలంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో మధ్యాహ్న భోజన కార్మికులతో ఎంఈవో బిక్కు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సమావేశాల్లో ఎంపీడీవో లక్ష్మణ్, డిప్యూటీ ఉపేందర్, కాంప్లెక్స్ ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

### ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

ముథోల్, డిసెంబర్ 3: ఆష్టా గ్రామంలో సీతారామ లక్ష్మణ ఆంజనేయ సహిత ఆదిత్యాది, నవగ్రహ పూర్వ ద్వాజ ప్రతిష్ఠాపన మహోత్సవం గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఆలయంలో వేద స్వస్తి, ధ్వజారోహణం, గణపతి పూజ నిర్వహించారు. గ్రామస్తులు ఆలయంలోని విగ్రహాలను శోభాయాత్రగా తీసుకెళ్లారు. ఈ కార్యక్రమం మరో రెండు రోజులు కొనసాగుతుందని గ్రామస్తులు తెలిపారు.

## 9న ఆదివాసీ హక్కుల ఉద్యమ దినోత్సవం

ఇంద్రవెల్లి, డిసెంబర్ 3 : ఇంద్రవెల్లి మండలంలో ఈ నెల 9వ తేదీన ఆదివాసీ హక్కుల ఉద్యమ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని రాయిసెంటర్ సార్‌మేడిలు, ఆదివాసీ పెద్దల సమక్షంలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి, తుడుందెబ్బ, రాయిసెంటర్ల పెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. భవిష్యత్ కార్యాచరణతోపాటు 9న నిర్వహించే ఉద్యమ దినోత్సవంపై చర్చించారు. కార్యక్రమంలో గోండ్వాన పంచాయతీ రాయిసెంటర్ జిల్లా సార్‌మేడి మెస్రం దుర్గు, ఆదివాసీల తొమ్మిది తెగల సమన్వయకర్త భీంరావ్, తుడుందెబ్బ రాష్ట్ర కన్వీనర్ బుర్స పోచయ్య, కో కన్వీనర్ గణేశ్, కేస్లాపూర్ సార్‌మేడి మెస్రం వెంకట్‌రావ్‌పటేల్, వడగాం సార్‌మేడి మెస్రం చిన్నుపటేల్, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పెందూర్ దాదిరావ్, మండలాధ్యక్షుడు పుర్కా చిత్రు, నాయకులు పాల్గొన్నారు.

## బ్యాంకులో నాగుపాము కలకలం

పామును పట్టుకున్న ఫయాజ్

బాసర, డిసెంబర్ 3 : బాసరలోని ఎస్‌బీఐలో మంగళవారం నాగుపాము కలకలం రేపింది. సుమారు గంటసేపు ఖాతాదారులను భయాందోళనకు గురి చేసింది. ప్రధాన రోడ్డుపై నుంచి బ్యాంకు లోపలికి వెళ్లడానికి ప్రయత్నించింది. గంటసేపు బ్యాంకు దగ్గరే ఉండి అందరిని భయాందోళనకు గురిచేసింది. దీంతో బ్యాంకు మేనేజర్ అశోక్ ఫయాజ్ పాములు పట్టే వ్యక్తిని పిలిపించడంతో అతను పామును పట్టుకొని అటవీప్రాంతంలో వదిలేశాడు. దీంతో బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు ఊపిరి పీల్చుకున్నారు.

## సింహగర్జనతో మాలల ఐక్యతను చాటాం

ఎదులాపురం, డిసెంబర్ 3 : మాలల ఐక్యతను ప్రభుత్వానికి తెలియజేయడానికి ఈ నెల 1వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించిన మాలల సింహగర్జన సభ విజయవంతమైందని మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పుల రమేశ్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. మాలల ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడానికి నిర్వహించిన సింహగర్జన సభలో పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చారన్నారు. సమావేశంలో గౌరవాధ్యక్షులు మేకల మల్లన్న, రాఘవేంద్ర పాశం, సభ్యులు మెట్టు ప్రహ్లాద్, రఘు, కిరణ్, లక్ష్మణ్, సుధీర్, అశోక్, అర్జున్, స్వామి, భగవాన్ పాల్గొన్నారు.

## భవిత కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

జైనథ్, డిసెంబర్ 3 : మండలంలోని ఆయా గ్రామాల్లోని దివ్యాంగులు మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. దివ్యాంగులకు ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, సైన్ లాంగ్వేజ్ వంటి 21 రకాల థెరపీ నిర్వహించడం జరుగుతుందన్నారు. క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జైనథ్ కాంప్లెక్స్ హెచ్‌ఎం లస్మన్న, పీడీ దయానంద్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో

సోన్, డిసెంబర్ 3: సోన్ మండలం పాక్‌పట్ల గ్రామంలోని శ్రీ సరస్వతి విద్యానికేతన్ పాఠశాలను మంగళవారం ఎంఈవో తొడిశెట్టి పరమేశ్వర్ తనిఖీ చేశారు. విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులచే విద్య బోధన చేయాలని సూచించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు మల్లేశ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

### ఆశ కార్యకర్తల ఆందోళన

సారంగాపూర్, డిసెంబర్ 3: సారంగాపూర్‌లోని ప్రభుత్వ దవాఖాన వద్ద మంగళవారం ఆశకార్యకర్తలు ఆందోళన చేపట్టారు. లెప్రసీ, పల్స్‌పోలియో, పెండింగ్ డబ్బులను చెల్లించిన తర్వాతనే కొత్త సర్వేలు చేయాలని లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో ఆశకార్యకర్తలు శ్యామల, సుశీల, స్వరూప, రాజమణి, లక్ష్మి, సునంద, విజయ, వనిత పాల్గొన్నారు.

### వైల్డ్‌లైఫ్ బోర్డు సభ్యుడిగా ఖానాపూర్ ఎమ్మెల్యే

ఉట్నూర్, డిసెంబర్ 3 : ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్‌ను రాష్ట్ర వన్యప్రాణి సంరక్షణ బోర్డులో సభ్యుడిగా నియమిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీ సభ్యులు వన్యప్రాణి సంరక్షణ బోర్డుకు సలహాలు, సూచనలు ఇస్తూ ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేయనున్నారు. అలాగే కమిటీలో ముగ్గురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు, ప్రభుత్వ చీఫ్ సెక్రటరీతో పాటు 12 మంది ఉన్నతాధికారులు సభ్యులుగా ఉంటారని తెలిపారు.

### రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు వేగవంతం చేయాలి

ఎదులాపురం, డిసెంబర్ 3 : ఆదిలాబాద్‌లోని స్పిన్నింగ్ మిల్లు వద్ద ప్రారంభించిన రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ కాంట్రాక్టర్‌కు సూచించారు. మంగళవారం బ్రిడ్జి వద్ద జరుగుతున్న పనులను ఆయన పరిశీలించి సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. ఓవర్ బ్రిడ్జి పనులు పూర్తి కాకపోవడం కారణంగా పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట నాయకులు అశోక్ రెడ్డి, రవి ఉన్నారు.

### ఆయిల్ పామ్ తోటలతో అధిక లాభాలు

దస్తురాబాద్, డిసెంబర్ 3 : ఆయిల్ పామ్ తోటలతో అధిక లాభాలు పొందవచ్చని ఏఈవో జాడి తిరుపతి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రియూనిక్ ఆయిల్ కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రియూనిక్ ఆయిల్ కంపెనీ డీజీఎం మల్లేశ్వర్ రావు, క్లస్టర్ అధికారి జాడి నవీన్, రైతులు పాల్గొన్నారు.

### ఆలయ హుండీ లెక్కింపు

జైనథ్, డిసెంబర్ 3: జైనథ్ లక్ష్మీనారాయణ స్వామి జాతర తర్వాత మంగళవారం ఆలయంలో దేవాదాయ అధికారులు, భక్తులు, గ్రామస్తులు స్వామి వారి హుండీ లెక్కింపు నిర్వహించారు. ఇందులో మూడు హుండీలు లెక్కించగా రూ.3,05,214 నగదు రూపంలో ప్రభుత్వానికి వచ్చినట్లు దేవాదాయ ధర్మదాయ ఆదిలాబాద్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ రంగు రవి కిషన్ తెలిపారు. ఆలయ కార్య నిర్వహణాధికారి వామన్‌రావ్, ఆలయ కమిటీ చైర్మన్ అడ్డి రుకేశ్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు అశోక్, రమేశ్, లసుంబాయి, అర్చకులు దీరజ్‌కుమార్, ఆలయ జూనియర్, అసిస్టెంట్ .రవి కిరణ్, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

### దివ్యాంగులకు ఆరోగ్య సేవలందించేందుకు చర్యలు

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 3: దివ్యాంగులకు అన్ని రకాల ఆరోగ్య సేవలందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కార్యక్రమ నిర్వహణ అధికారి డా.శ్రీనివాస్ అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్మల్ వైద్య కళాశాల దవాఖానలోని యోగా కేంద్రంలో ఫైలేరియాతో బాధపడుతున్న వారికి వెస్టర్న్ కామెడీస్‌ను మ్యాన్‌కైండ్ సంస్థ ఆర్థిక సాయంతో లెప్రా ఇండియా ఆధ్వర్యంలో అందజేశారు. సత్యసాయి సేవా సమితి సహకారంతో దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మీడియా విస్తరణాధికారి రవీందర్, డీపీఎంవో రాజేశ్వర్, లెప్రా సొసైటీ ఫిజియో థెరపిస్ట్ కిషన్‌రావు, సత్యసాయి సేవా సమితి సభ్యులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ గ్యారెంటీలు గారడీ

కుంటాల, డిసెంబర్ 3 : గ్యారెంటీల గారడీతో తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ మోసం చేస్తోందని, నియోజకవర్గంలోని అన్ని మండలాల వారీగా బీజేపీ చార్జ్‌షీట్ దాఖలు చేస్తుందని నియోజకవర్గ కార్యక్రమ ఇన్‌చార్జి, భైంసా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజేశ్ బాబు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్లి నుంచి లోకేశ్వరం వరకు 46 కోట్లతో బీఆర్‌ఎస్ హయాంలో మంజూరు అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ ఎంపీపీ గజ్జారాం, నాయకులు అశోక్, గోవర్ధన్ పాల్గొన్నారు.

### అడవులను కాపాడుకోవాలి

కుంటాల, డిసెంబర్ 3 : అడవులు కలపను ఉత్పత్తి చేస్తాయని, వన్యప్రాణులను సంరక్షిస్తాయని భైంసా ఎఫ్ఆర్‌వో వేణుగోపాల్ అన్నారు. మంగళవారం ఓలా బీట్ పరిధిలోని అంబుగాం, మెదన్‌పూర్, సూర్యాపూర్, రాజాపూర్‌లోని గ్రామస్తులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అడవిలోకి తేనె, తునికాకు సేకరణకు వెళ్లరాదని, అడవులను కాపాడుకోవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో కీర్తి, ఎఫ్‌బీవోలు హరిలత, ముస్తాక్, మహేశ్వర్ పాల్గొన్నారు.

### కౌలు రైతుల ప్రజా దర్బార్‌ను విజయవంతం చేయాలి

బోథ్, డిసెంబర్ 3 : హైదరాబాద్‌లో బుధవారం నిర్వహిస్తున్న కౌలు రైతుల ప్రజా దర్బార్‌ను విజయవంతం చేయాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న పిలుపునిచ్చారు. మంగళవారం కన్నుగుట్ట గ్రామంలో రైతులతో కలిసి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కౌలు రైతులను గుర్తించి వారికి రైతు భరోసాతో పాటు ఎల్ఈసీ కార్డులు ఇవ్వాలన్నారు. యాసంగి సీజన్ ప్రారంభమైనా రైతు భరోసా ఇవ్వలేనటువంటి పరిస్థితి దాపురించిందన్నారు. కార్యక్రమంలో రైతులు రాజు, ఎం.రాజేందర్, గణేశ్, రామకృష్ణ, శంకర్ పాల్గొన్నారు.

### గిరిజన పిల్లలకు మెరుగైన వైద్యం అందించాలి

ఉట్నూర్,డిసెంబర్ 3 : గిరిజన పిల్లలకు మెరుగైన వైద్యం అందించాలని ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. మంగళవారం పీవో క్యాంప్ కార్యాలయంలో ఉమ్మడి జిల్లాలోని ఆశ్రమ పాఠశాల డీటీడీవో, ఏటీడీవోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శీతాకాలం నేపథ్యంలో విద్యార్థుల స్నానాలకు వేడినీళ్లు, విటామిన్ సీ విలువలతో కూడిన ఐరన్ టాబ్లెట్ అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో క్రీడాధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### పోలీసుల ఆధ్వర్యంలో కళాజాత

ఇచ్చోడ(సిరికొండ), డిసెంబర్ 3: సిరికొండలో పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్ డీఎస్పీ హసీయుల్లా ఖాన్ మాట్లాడుతూ ప్రజల కోసం పోలీసులు పని చేస్తారని అన్నారు. తెలియని వారికి ఫోన్, ఆధార్ కార్డు, పాన్ కార్డు నంబర్ ఇవ్వద్దని అన్నారు. ఇతర వివరాలు అడిగినట్లయితే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమం సిరికొండ ఎస్ఐ శివరాం, ఏఎస్ఐ కాత్లే రమేశ్, పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

**CHANGE OF NAME**
I, PADGELWAR PRAVEEN (Old name) S/o. PADGELWAR, VISHWANATH, R/o. H.No.3-9-129, Brahmanwada, Adilabad is hereby change my Name as "PADAGELA PRAVEEN" (New Name) as per my all Indentification proofs. holding Passport No.G0774736, Dt. 15-11-2006 to 14-11-2016 issued at Hyderabad Po. Hence Declared.

**డాక్యుమెంట్ పోయినది**
నా పేరు మల్లెల శ్రీధర్ తండ్రి లచ్చన్న గ్రా॥ కజ్జర్ల, మం॥ తలమడుగు, జిల్లా ఆదిలాబాద్. నా యొక్క డాక్యుమెంట్స్ నెం.1)5541/2019, 2) 1174/2015, 3) 8183/2018 మావల నుండి ఆదిలాబాద్ వెళ్ళే మార్గంలో పడిపోయింది. ఎవరికైనా దొరికినచో సంప్రదించండి. సెల్: 63051 13596

**CHANGE OF NAME**
★I, SHAMA BARKAT JIWANI, W/o. Arif Jiwani, R/o. 1-78/1, Gudihathnoor, District: Adilabad, TS-504 308. Changed My Name as SHAMA JIWANI.
NT-326841

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.